

ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లును అభినందిస్తున్న ఎంఈఓ హీర్యానాయక్

పాఠశాల అభివృద్ధికి కృషి హర్షణీయం: ఎంఈఓ

వనస్థలిపురం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి కృషి చేయడం హర్షణీయమని హయత్‌నగర్ ఎంఈఓ హీర్యానాయక్ అన్నారు. మన్సూరాబాద్ డివిజన్ ఇందిరానగర్‌లోని ప్రాథమిక పాఠశాలకు ప్రహరీగోడ, గేట్లు లేవని పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిర్మల రిటైర్డ్ ప్రభుత్వ ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకవచ్చారు. అందుకు తక్షణమే స్పందించిన వెంకటేశ్వర్లు తన మిత్రుడు పరుచూరి ప్రవీణ్‌కుమార్‌తో పాటు ఇతర మిత్రబృందంతో కలిసి పాఠశాలకు ప్రహరీగోడ, గేట్లు ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమానికి ఎంఈఓ హీర్యానాయక్ హాజరై మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి కృషిచేయడం అభినందనీయమన్నారు. భవిష్యత్‌లో పాఠశాలకు ఎలాంటి సహకారం కావాలన్న అందజేస్తామని వెంకటేశ్వర్లు, ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు నిర్మల, ఉపాధ్యాయులు బి.వనిత, రాధకృష్ణ, దీన్‌దయాల్, రజిని, కాలనీవాసులు ధన్‌పాల్‌గౌడ్, హన్మయ్యగౌడ్ పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న మాజీ కార్పొరేటర్ లక్ష్మీప్రసన్న

రక్తదానం చేయండి.. ప్రాణాలు కాపాడండి

వనస్థలిపురం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రక్తదానం చేసి విలువైన ప్రాణాలు కాపాడాలని బీఎన్‌రెడ్డినగర్ మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీప్రసన్న అన్నారు. మదర్ థెరిస్సా చారిటబుల్ సొసైటీ అధ్యక్షుడు చేపూరి శంకర్ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సాహెబ్‌నగర్‌లోని కల్యాణమండపంలో బుధవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ తలసేమియా బాధితుల సహాయార్థం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆకృతి సుధాకర్, కాలనీవాసులు పాల్గొన్నారు.



అన్నదాన కార్యక్రమంలో శ్రీశైవ క్షేత్ర పీఠాధిపతి శివ స్వామిజీ

ఘనంగా ఉగాది ఉత్సవాలు

ఎల్‌బీనగర్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): శ్రీశైవ క్షేత్ర వనితా శక్తి ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో టెలిఫోన్ కాలనీ రోడ్డు నం.4లోని శ్రీశైవ క్షేత్ర పీఠంలో ఉగాది ఉత్సవాలు ఘనంగా జరిగాయి. బుధవారం జరిగిన ఈ వేడుకలకు శ్రీశైవ క్షేత్ర పీఠాధిపతి శివ స్వామిజీ ముఖ్య అతిథిగా హాజరై పంచలింగాలకు అభిషేకం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకుని అందరితో కలిసిమెలసి జీవించాలని సూచించారు. కార్యక్రమంలో సినీ నిర్మాత విజయ్‌కుమార్, శ్రీనివాస్, కిరణ్‌కుమార్, శ్రీశైవ క్షేత్ర వనిత శక్తి ఇంటర్నేషనల్ ఎండీ అయిత హేమ, ధర్మో రక్షతి రక్షితః ట్రస్ట్ రాష్ట్ర అధ్యక్షుడు ఎడారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



కల్యాణోత్సవం బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

సీతారాముల కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు

సైదాబాద్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): చావునీ ఉప్పరిగూడ రామాలయంలో ఈనెల 17వ తేదీ నుంచి సీతారాముల కల్యాణోత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. బుధవారం ఆలయంలో కల్యాణోత్సవ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఉత్సవాలు ఏప్రిల్ 21వరకు కొనసాగుతాయని వివరించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు సంపత్‌యాదవ్, నిరంజన్‌యాదవ్, రాంపాల్ యాదవ్, శ్రీనివాస్, ధన్‌రాజ్, యాట ప్రమోద్‌యాదవ్, రాహుల్ కిషోర్, ప్రవీణ్, రాజ్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ బాల్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం



బాల్‌రెడ్డి విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న మాజీ కార్పొరేటర్ రమణారెడ్డి

చంపాపేట, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): చంపాపేట గ్రామానికి 28సంవత్సరాల పాటు గ్రామ సర్పంచ్, మూడు సంవత్సరాలు భాగ్యనగర్ కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్‌గా పని చేసిన సామ బాల్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం అని మాజీ కార్పొరేటర్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సామ రమణారెడ్డి అన్నారు. సామ బాల్‌రెడ్డి 23వ వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం చంపాపేటలోని నేతాజీ యూత్ అసోసియేషన్ కమ్యూనిటీహాల్ వద్ద ఆయన విగ్రహానికి సామ రమణారెడ్డితో పాటు బాల్‌రెడ్డి కుమారుడు సామ నర్సింహారెడ్డి, మనువండ్లు సామ గౌతం రెడ్డి, సామ వంశీదర్‌రెడ్డి బాల్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అన్నదానం కార్యక్రమంల చేశారు. కార్యక్రమంలో నేతలు బైగళ్ల రవీందర్, మెట్టు సంజీవరెడ్డి, మెట్టు వెంకట్‌రెడ్డి, మాతంగి నర్సింహ, యాదగిరి, మంత్రి జగన్, శ్రీపాల్‌రెడ్డి, రఘునందన్‌రెడ్డి, పెంటయ్యగౌడ్, కట్టా వెంకటేష్, దుర్గాదాస్, లక్ష్మీనారాయణ, సుదర్శన్, జయన్న, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

కాచిగూడలో 21 డ్రంకెన్ డ్రైవ్ కేసులు

బర్కత్‌పుర, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ ట్రాఫిక్ పీఎస్ పరిధిలో 21 డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయని సీఐ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. వీరిలో 16 మందికి నాంపల్లి కోర్టు జరిమానా విధించింది. ఇద్దరికి రెండు రోజులు, మరో ఇద్దరికి నాలుగు రోజులు, ఒకరికి 15 రోజులు జైలు శిక్ష విధించిందని ఆయన పేర్కొన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

రంజాన్‌కు సర్వం సిద్ధం

● మసీదులు, ఈద్గాలలో నమాజ్‌కు ఏర్పాట్లు

సైదాబాద్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రంజాన్ ప్రత్యేక ప్రార్థనలకు సైదాబాద్, మాదన్నపేట, అక్బర్‌బాగ్‌లలో ఈద్గాలను ముస్తాబు చేశారు. ముస్లింలు నిర్వహించే సామూహిక ప్రార్థనల కోసం మసీద్, ఈద్గాల వద్ద జీహెచ్ఎంసీ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అక్బర్‌బాగ్, మాదన్నపేట ఈద్గాలలో జరిగే సామూహిక ప్రార్థనల్లో 20వేల మందికి పైగా ముస్లింలు ప్రార్థనలు చేసుకోవడానికి వీలుగా సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నారు. పలు మసీదులు విద్యుత్తు వెలుగులతో మెరిసిపోతున్నాయి. ఎండ తీవ్రత దృష్ట్యా చలువ పందిళ్లు, కూలర్లు ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ప్రార్థనలకు ముందు కాళ్లు, చేతులు కడుగుకోవడానికి వీలుగా ప్రత్యేక నీటి వసతిని కల్పిస్తున్నారు. నెల రోజుల ఉపవాసం దీక్ష పాటించి అల్లాహ్ అనుగ్రహాన్ని పొందిన ఆనందంతో జరుపుకునే పండుగ రంజాన్, ఈదుల్ ఫితర్ నమాజ్‌కు ముందు సంవత్సరం పొడవునా సపాదించిన ఆదాయంలో కొంత భాగం పండుగ రోజు అల్లా పేరిట(ఫిత్రా) దానం చేస్తారు.



ఉజలేషా ఈద్గాలో ఏర్పాట్లు



ముస్తాబైన అక్బర్‌బాగ్ ఈద్గా

పోలీసుల భారీ బందోబస్తు

రంజాన్ ప్రత్యేక ప్రార్థనల సందర్భంగా ముందు జాగ్రత్తగా మాదన్నపేట, సైదాబాద్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అక్బర్‌బాగ్, మాదన్నపేట ఈద్గాల ఆవరణను బాంబ్‌స్క్వాడ్, డాగ్‌స్క్వాడ్‌లు అణువణువునా తనిఖీ చేశారు. మాదన్నపేట, అక్బర్‌బాగ్ ఈద్గాలలో జరిగే ప్రత్యేక ప్రార్థనలకు భారీగా ముస్లింలు పాల్గొనే అవకాశం ఉన్నందున, అందుకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు వాహనాలను దారి మళ్లించనున్నారు.

సునీతామహేందర్‌రెడ్డిని గెలిపించాలి

● మధుయాష్కీగౌడ్

వనస్థలిపురం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డికి మద్దతుగా చేపట్టవల్సిన ప్రచారంపై ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని 10 డివిజన్ల పార్టీ అధ్యక్షులతో టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ వనస్థలిపురంలోని పార్టీ కార్యాలయంలో పట్నం సునీతామహేందర్‌రెడ్డి కుమారుడు రినీష్‌రెడ్డితో కలిసి బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మధుయాష్కీగౌడ్ మాట్లాడుతూ ఈనెల 16న ఉదయం నుంచి రాత్రి వరకు ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో ఎంపీ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డి పర్యటించి ప్రచారం నిర్వహిస్తారన్నారు. అందుకు తగిన ప్రణాళికలు, పార్టీ మేనిఫెస్టో, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ఎన్నికల ప్రచారానికి దాదాపు నెల రోజుల సమయం ఉండడంతో పార్టీ అభ్యర్థిని గెలిపించడమే ధ్యేయంగా ప్రతి పార్టీ కార్యకర్త కష్టపడి పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా డివిజన్ల అధ్యక్షులు కట్ల నర్సింహయాదవ్, మకుటం సదాశివుడు, లింగాల కిషోర్‌గౌడ్, బుడ్డ సత్యనారాయణ, వేణుగోపాల్‌యాదవ్, గజ్జి శ్రీనివాస్‌యాదవ్, శ్రీపాల్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, మంజులారెడ్డి, ఎల్‌బీనగర్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు స్వర్ణమాధవి పాల్గొన్నారు.



డివిజన్ అధ్యక్షులతో సమీక్షా సమావేశంలో మధుయాష్కీగౌడ్

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి పట్టం కట్టాలి

● చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి
● శంకర్‌పల్లి, చేవెళ్ల మండలాల్లో ప్రజాఆశీర్వాదయాత్రలో కొండా పర్యటన

చేవెళ్ల, ఏప్రిల్ 10 : ప్రధాని నరేంద్రమోదీ పరిపాలనలో భారతదేశ కీర్తి ప్రతిష్టలు గణనీయంగా పెరిగాయని చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ప్రజా ఆశీర్వాద యాత్రలో భాగంగా బుధవారం శంకర్‌పల్లి మండలంలోని లక్ష్మారెడ్డిగూడ, గాజులగూడ, దోబిపేట్, అలంకాన్‌గూడ, పత్తేపూర్, బుల్కాపూర్, మోకిల, ప్రొద్దటూర్ తదితర గ్రామాల్లో పర్యటించారు. అలాగే సాయంత్రం చేవెళ్ల మండలంలోని ఎన్కెపల్లి, ఆలూర్, మీర్జగూడ, బస్తేపూర్, చనువల్లి తదితర గ్రామాల్లో పర్యటించి ప్రజల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యావత్ భారతదేశం నరేంద్రమోదీ వెంటే నడుస్తున్నారని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో మోదీ ప్రభంజనాన్ని ఎదుర్కోలేక కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ కేరళకు పారిపోయారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు అన్ని విధాల సబ్సిడీలపై ఎరువులను అందిస్తు, మద్దతు ధర సైతం అందిస్తుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. రెండు లక్షల రుణమాఫీ, వృద్ధులకు పెంచిన పెన్షన్ అందించలేకపోయిందని మండిపడ్డారు. రైతులకు బోనస్ కూడా ఇవ్వలేదని ఎద్దేవ చేశారు. మాజీ సీఎం కేసీఆర్ పదేళ్ల పాలించి రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని విమర్శించారు. ధనిక రాష్ట్రాన్ని దివాల తీసిన రాష్ట్రంగా మార్చిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని భారీ మెజార్టీతో గెలిపిస్తే చేవెళ్ల ప్రాంత అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను ఎన్నికల్లో ఓడించి బీజేపీకి పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కెఎస్. రత్నం, మైలార్ దేవులపల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, బీజేపీ శంకర్‌పల్లి మండల అధ్యక్షుడు రాములుగౌడ్, చేవెళ్ల కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, శంకర్‌పల్లి మాజీ ఎంపీపీ బీర్ల నర్సింహులు, సీనియర్ నాయకులు సురేశ్‌యాదవ్, పరమేశ్వర్‌రెడ్డి, బొడ్డు రవి, జంగారెడ్డి, వెంకటేశ్, లక్ష్మారెడ్డి, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

కాంగ్రెస్ విజయానికి కృషి చేయాలి

● ఎంపీ రంజిత్‌రెడ్డి
● రంజిత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన మల్కారం మాజీ సర్పంచులు

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 10: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం కోసం ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి అన్నారు. బుధవారం పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇన్‌చార్జి నరేందర్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని మల్కారం మాజీ సర్పంచ్‌లు వెంకటేష్, మాధవి యాదగిరిరెడ్డి, సింగిల్ విండో మాజీ వైస్ చైర్మన్ రాజిరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ జంగయ్య, వీరితో పాటు మరో 200 మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు రంజిత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించాలంటే ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. రాష్ట్రం, మన ప్రాంతం అభివృద్ధి చెందాలంటే ఢిల్లీలో మన వాణి వినిపించాలని అందు కోసం చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించాలని కోరారు. గతంలో ఎంపీగా ఉన్నపుడు వందల కోట్ల నిధులు తీసుకొచ్చి పార్లమెంట్ నియోజక వర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శి మహేందర్, కోటేశ్వర్‌గౌడ్, జీవన్‌గౌడ్, ఫక్రుద్దీన్, రఫీక్, సిద్దేశ్వర్, చంద్రశేఖర్, సురేష్, జిల్లా అనంద్, ప్రభాకర్, అంజనేయులు, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



రంజిత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న మాజీ సర్పంచ్‌లు

మా ఆయనను ఆదరించండి.. అభివృద్ధి చేస్తాడు

● తుక్కుగూడ ఇంటింటి ప్రచారంలో చేవెళ్ల ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి సతీమణి సీతారంజిత్‌రెడ్డి

మహేశ్వరం, ఏప్రిల్ 10 : చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి, తన భర్త రంజిత్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి సతీమణి సీతారంజిత్‌రెడ్డి అన్నారు. బుధవారం తుక్కుగూడ మున్సిపాలిటీలోని 15వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించిన ఆమె ఓటర్లకు తమ గుర్తును చూపిస్తూ ఓట్లను అభ్యర్థించారు. అదేవిధంగా తన భర్త ఐదు సంవత్సరాలుగా ఎంపీగా ఉండి ఈ ప్రాంతానికి చేసిన అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రజలకు వివరించారు. ఈసారి కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడం కాయమైందన్నారు. గతంలో మాదిరిగానే ఇప్పుడు కూడా రంజిత్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించి చేతి గుర్తుపై ఓటువేసి ఆదరిస్తే మహేశ్వరాన్ని మరింత అభివృద్ధిపథంలో నడిపిస్తారన్నారు. రంజిత్‌రెడ్డి ఎప్పుడు ప్రజల సంక్షేమం కోసం పరితపిస్తారని ఈ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు సీతారంజిత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ ఇంటింటి ప్రచార కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి గోగికార్ జానకీరామ్, తుక్కుగూడ మున్సిపల్ వైస్ చైర్మన్ బి. వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్ తేజశ్విని శ్రీకాంత్, మాజీ సర్పంచ్ దేవరాయసుధాకర్, రాజేందర్, పద్మభాస్కర్ రెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సమత, యాదయ్య పాల్గొన్నారు.



తుక్కుగూడలో ఇంటింటి ప్రచారం చేస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్న రంజిత్‌రెడ్డి సతీమణి సీతారంజిత్‌రెడ్డి

వృద్ధురాలిని బెదిరించి దోపిడీకి పాల్పడిన దొంగ అరెస్ట్

● దొంగతనం జరిగిన 5 గంటల్లోనే ఛేదించిన పోలీసులు
● బంగారు ఆభరణాలు స్వాధీనం

అల్వాల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలి మెడలో బంగారాన్ని దొంగలించిన సంఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బుధవారం అల్వాల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ జి.రాజేందర్‌గౌడ్ వివరాలను వెల్లడించారు. వచ్చ బొల్లారం, అంజనాపురికాలనీలో గ్రౌండ్‌ఫ్లోర్‌లో నుంచు సుగుణమ్మ(65) ఒంటరిగా ఉన్నారు. అలేరు గ్రామం, తెల్కపల్లి మండలం, నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన దేశమోనీ సాయితేజ (20) అంజనాపురీ కాలనీలోనే ఒక ఇంట్లో స్నేహితులతో కలిసి అద్దెకు ఉంటూ.. ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. నిందితుడు సాయితేజ 8వ తేదీన సోమవారం మధ్యాహ్నం సమయంలో సుగుణమ్మ ఇంటి దగ్గరికి వెళ్లి రెక్కీ నిర్వహించాడు. ఆమె మెడలో బంగారు ఆభరణాలను చూసి దొంగతనం చేయాలని నిర్ణయించుకున్నాడు. ఆ రోజు అక్కడ జనాలు ఉండటంతో కుదరక తిరిగి తన రూమ్‌కి వెళ్లిపోయాడు. మరసటి రోజు ఉగాది పండుగ నాడు మంగళవారం మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయంలో మళ్లీ సుగుణమ్మ ఇంటి దగ్గరకు వెళ్లి రెక్కీ నిర్వహించాడు. సమీపంలో జనాలు ఎవ్వరూ లేకపోవడంతో ఇదే అదనుగా భావించి ఇంటి గేటు తీసుకుని లోనికి వెళ్లి సుగుణమ్మను దాహంగా ఉందని మంచినీళ్లు అడిగాడు, ఆమె నీళ్లు లేవని డోర్ పెడుతుండగా డోర్‌ను నెట్టి ఇంట్లోకి ప్రవేశించాడు. సుగుణమ్మ గొంతును నిందితుడు సాయితేజ గట్టిగా పట్టుకుని భయభ్రాంతులకు గురిచేశాడు. ఆమె మెడలో దారంతో ఉన్న బంగారు అనెలు, బంగారు పతకములు, చెవికి ఉన్న పోగులను తెంచుకుని అక్కడి నుంచి నడుచుకుంటు తన రూమ్‌కి పారిపోయాడు. పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించి 5గంటల్లోనే నిందితుడిని పట్టుకున్నారు. నిందితుడి నుంచి దోపిడి చేసిన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని డీఐ రాజేందర్‌గౌడ్ వెల్లడించారు. కేసు ఛేదించిన డీఐ.రాజేందర్‌గౌడ్‌తో పాటు క్రైమ్ సిబ్బందిని ఏసీపీ రాములు, అల్వాల్ స్టేషన్‌హౌజ్ ఆఫీసర్ అభినందించారు.



పార్టీ ముఖ్య నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

13న చేవెళ్ల బహిరంగసభకు తరలిరావాలి

● మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి

మహేశ్వరం, ఏప్రిల్ 10 : ఈనెల 13వ తేదీన చేవెళ్లలో జరుగనున్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ భారీ బహిరంగ సభకు మహేశ్వరం నుంచి కార్యకర్తలు ఎక్కువ మొత్తంలో తరలిరావాలని ఎమ్మెల్యే పి. సబితారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని మన్‌సాన్‌పల్లిచౌరస్తాలో బీఆర్ఎస్ ముఖ్యనాయకులతో సమావేశమైన ఆమె మాట్లాడుతూ చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఈనెల 13న చేవెళ్లలో భారీ బహిరంగ సభ ఉంటుందని దీనికి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధినేత కేసీఆర్ హాజరవుతున్నందున పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాజునాయక్, నాయకులు మల్లేష్‌యాదవ్, వెంకటేశ్వర్‌రెడ్డి, చంద్రయ్య, నవీన్, శ్రీవారెడ్డి, రాయప్ప, నర్సింహయాదవ్, కంది రమేష్, ప్రభాకర్ పాల్గొన్నారు.

40సార్లు రక్తమిచ్చిన ఇన్‌స్పెక్టర్



రక్తదానం చేస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగమల్లు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలు.. ప్రమాదాల్లో గాయపడి సకాలంలో రక్తం అందక ఇబ్బందులు పడుతున్నా.. ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నట్లు తెలిసినా చాలు.. ఆ ఇన్‌స్పెక్టర్ వెంటనే స్పందిస్తారు. వారి వివరాలు తెలుసుకొని, సొంత ఖర్చులతో ఆస్పత్రికి వెళ్లి వారికి అవసరమైన రక్తాన్ని దానం చేసి, వారికి మనోస్థైర్యాన్ని ఇచ్చి వస్తుంటారు. ఆయన ఎవరో కాదు హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ట్రాఫిక్ విభాగంలో పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్ అంజపల్లి నాగమల్లు. బుధవారం గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ పేద మహిళకు అత్యవసరంగా రక్తం అవసరమని తెలియగానే.. ఇన్‌స్పెక్టర్ నాగమల్లు హుటాహుటిన ఆస్పత్రికి వెళ్లి రక్తదానం చేశారు. కరోనా లాక్‌డౌన్ నుంచి అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం చేసి, కొంతమందికైనా ఊపిరిపోయాలని నిర్ణయించుకుని ఇప్పటి వరకు 40 సార్లు రక్తదానం చేసినట్లు ఇన్‌స్పెక్టర్ నాగమల్లు తెలిపారు. యువత ముందుకొచ్చి రక్తదానం చేయాలని, తలసీమియాతో బాధపడుతున్న వేలాదిమంది చిన్నారుల, రోడ్డు ప్రమాదాల్లో అత్యవసర చికిత్స పొందుతున్న క్షతగాత్రుల ప్రాణాలు కాపాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



గంజాయితో పట్టుబడిన నిందితులు

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తుల అరెస్ట్

దుండిగల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఒడిస్సా నుంచి గంజాయి తీసుక వచ్చి విక్రయిస్తున్న ముగ్గురు నిందితులను సైబరాబాద్ ఎస్ఓటీ, దుండిగల్ పోలీసులు అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.33 వేల 750 విలువ చేసే గంజాయిని పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఒడిస్సాకు చెందిన రంజన్ దాస్ (26), కేశవ్‌కౌడ్(28)న, గంగ (31)లు గండిమైసమ్మ సమీపంలోని శ్రీ చైతన్య క్యాంపస్ సమీపంలో గుడిసెలు వేసుకొని సెంట్రింగ్ పని చేస్తుంటారు. సెంట్రింగ్ పనిలో సంపాదన తక్కువ రావడంతో ఎక్కువ సంపాదించాలనే ఆశతో ఒడిస్సాకు చెందిన రావణ్ (16) గంజాయి సరఫరా చేయాలని ముగ్గురు కోరారు. రావణ్ మల్కన్‌గిరి ఒడిస్సా నుంచి హైదరాబాద్‌లోని గండిమైసమ్మకు తీసుకొని వచ్చి రంజన్‌దాస్, కేశవ్‌కౌడ్, గంగలకు గంజాయి కిలో రూ.7 వేల చొప్పున 1.35 కేజీల గంజాయిని ఇచ్చాడు. గంజాయి విక్రయిస్తున్న సమాచారం అందుకున్న పోలీసులు దుండిగల్ సమీపంలోని చింతల్ యాదగిరి ఖాళీ స్థలంలో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి గంజాయిని స్వాధీనం చేసుకొని విచారించగా రావణ్ సరఫరా చేశాడని నిందితులు ఒప్పుకున్నారు. రావణ్ పరారీలో ఉండగా ముగ్గురిని అరెస్ట్ చేసి, ఒక సెల్ ఫోన్ రూ. 33 వేల 750 విలువ చేసే గంజాయిని స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

లారీని ఢీకొట్టిన బైక్

● యువకుడు మృతి

జీడిమెట్ల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో తలకు బలమైన గాయాలై అక్కడి కక్కడే మృతి చెందిన సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సంగారెడ్డి జిల్లా కగ్గి మండలం, సిద్దంగిరి గ్రామానికి చెందిన రత్నప్పకుమారుడు ఎం.సంపత్‌కుమార్ (35) బతుకు దెరువు కోసం నగరానికి వచ్చి సూరారంకాలనీ ప్రాంతంలోని సాయిబాబా నగర్ మొండి నర్సింహాబస్తీలో ఉంటూ వెల్డర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం 1గంటల సమయంలో సంపత్‌కుమార్ జైరాజ్‌ఇస్పాత్ ఎదురుగా ఉన్న రోడ్డు నుంచి ఇంటికి బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. ఎదురుగా అతివేగంగా వచ్చిన లారీ బైక్‌ను ఢీకొట్టడంతో సంపత్‌కుమార్ కిందపడ్డాడు. లారీ ముందు చక్రాలు తలపై నుంచి పోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. జీడిమెట్ల పోలీసులు కేసు నమోదుచేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

హత్య కేసును ఛేదించిన పోలీసులు

● 13 మంది నిందితుల అరెస్ట్
● నలుగురు మైనర్స్

నిజాంపేట్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 8న ప్రగతినగర్‌లో హత్య చేసిన నిందితులను బాచుపల్లి పోలీసులు 13 మందిలో నలుగురు మైనర్లను అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి ఆరు సెల్ ఫోన్లు, నాలుగు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. బాచుపల్లి సీఐ ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. బోరబండ మోతీనగర్‌కు చెందిన నిందితులు ముందుగానే పథకం ప్రకారం ఓ హోటల్లో తేజాస్ హత్య గురించి చర్చించుకున్నారు. అనంతరం శివప్ప తేజాస్ ఇంటికి వెళ్లి మద్యం తాగాడు. వారి ప్రణాళిక ప్రకారం అపార్టుమెంట్ పై అంతస్తు నుంచి తేజాస్‌ను కిందికి తీసుకవచ్చి, తన స్కూటీపై సమీర్ వద్దకు తీసుకవెళ్లాడు. సమీర్ తన వద్ద ఉన్న కత్తితో తేజాస్‌ను పొడిచి చంపాడు. హత్యకు సహకరించిన రోహిత్, షమీర్, సిద్దేశ్వర్, శివప్ప, గణేష్, సునీల్, రాహుల్, తిరుమల్, మహేష్‌లను పోలీసలు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా నలుగురు మైనర్స్‌ను జ్యూ వైనల్ హోమ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఈ కేసును ఛేదించిన సిబ్బందిని డీసీపీ అభినందించారు.